
సాక్షి
జనగామ
శుక్రవారం | 6 | డిసెంబర్ | 2024



అభివృద్ధి దిశగా ఉర్సు గుట్ట
వరంగల్‌లోని ఉర్సుగుట్టను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయి. - 8లో▸



ఆటల్లో ఆణిముత్యాలు
మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. - 8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 29°/21°
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితోపాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

డేటా ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలి



రఘునాథపల్లి: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న సమగ్ర డేటా ఎంట్రీని ఆయన పరిశీలించారు. మండలంలో ఎన్యుమరేటర్లు సేకరించిన కుటుంబాలు ఎన్ని, వాటిలో ఎన్ని ఆన్‌లైన్ చేశారనే వివరాలను అధికారులను అడగగా, 19 వేల కుటుంబాల ఫారాలకు 17,200 ఇప్పటికే ఆన్‌లైన్ చేశామని.. మరో 1,800 ఫారాలను రెండు రోజుల్లో ఆన్‌లైన్ పూర్తి చేస్తామని ఎంపీడీఓ వివరించారు. సర్వేలో ప్రజలు వెల్లడించిన వివరాల్లో తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహిస్సా ముజ్జబ, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, ఎంఈఓ రఘునందన్‌రెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అబకాస్ శిక్షణ



జనగామ: వందేమాతరం స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక క్రిస్టస్ హై స్కూల్‌లో అబకాస్ ఉచిత శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. విద్యార్థులు, నిరుద్యోగులకు అడ్లగట్ట గంగాధర్ ఈ శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు వేగంగా లెక్కలు చేయడం నేర్పించారు. విద్యార్థులు అబకాస్ ప్రయోజనాలు, అనువర్తనాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీఎస్‌ఎఫ్, జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు, ప్రభుత్వ రిటైర్డ్ టీచర్ చంద్రమౌళి, టీజీవీపీ జిల్లా కార్యదర్శి తుంగ కౌశిక్, వీఎస్‌ఎఫ్ నాయకులు బిట్ల చిన్న, నరేష్ పాల్గొన్నారు.

బాల సంస్కార్ కేంద్రం ప్రారంభం



జనగామ: మన ఆచార నియామకాలు, నిష్టలను ఆచరిస్తూ ధర్మపరిరక్షణకు సామాజిక బాధ్యతగా పాటుపడాలని గ్లోబల్ ఫౌండేషన్ రాష్ట్ర బాధ్యుడు పూస్కురి సోమేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాల సంస్కార్ కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. మన జాతీయ విధానం, సంస్కృతి సంప్రదాయాలను కాపాడడమే బాల సంస్కార్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. పిల్లలకు చదువుతోపాటు, దేశంపై స్ఫూర్తిని నింపి, సమాజంలో వారు ఉన్నతంగా జీవించేలా తయారు చేయాలన్నారు. బాల సంస్కార్ కేంద్రాల ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనేక మంది పిల్లల్ని ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దామని తెలిపారు.

ఇంటర్వ్యూలు

జనగామ రూరల్: క్వాలిటీ మేనేజర్, ఏపిడమాలజిస్ట్ పోస్టులకు ఈనెల 9న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి మల్లికార్జునరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వాలిటీ మేనేజర్, ఏపిడమాలజిస్ట్ పోస్టును అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్‌లో భాగంగా ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. క్వాలిటీ మేనేజర్‌కు వేతన రూ.40,000 ఉంటుదని మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మాస్టర్స్ డిగ్రీ ఇన్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ అర్హత ఉండాలని తెలిపారు. కనీసం మూడేళ్ల హాస్పిటల్ మేనేజ్‌మెంట్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, కంప్యూటరు జ్ఞానం ఉండాలని, తప్పనిసరిగా ఇంగ్లిష్‌లో రాయడం, మాట్లాడడం తెలిసి ఉండాలని పేర్కొన్నారు. ఏపిడమలాజిస్ట్‌కు రూ.50,000 వేతనం ఉంటుందని, ఎంబీబీఎస్ ఎండ్ ప్రివెంటివ్ మెడిసిన్ లేదా ఎంబీబీఎస్, బీడీఎస్, బీపీ ఏంఎస్, బీఎస్సీ (నర్సింగ్) మాస్టర్స్ ఇన్ పబ్లిక్ హెల్త్, డిప్లొమా ఇన్ పబ్లిక్ హెల్త్, లేదా ఎమ్మెస్సీ ఇన్ లైఫ్ సైన్స్ రెండు సంవత్సరాల మాస్టర్స్ ఇన్ పబ్లిక్ హెల్త్ లేదా ఎమ్మెస్సీ ఏపిడమాలజీ ఉండాలని తెలిపారు. ఏదైనా మెడికల్ గ్రాడ్యుయేట్, రెండు సంవత్సరాల పబ్లిక్ హెల్త్‌లో అనుభవం ఉండాలని, ఎమ్మెస్సీ ఏపిడమాలజీ గల వారు రెండు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. అర్హుత కలిగిన అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో 9వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో మధ్యాహ్నం 02:30 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

బేరసారాలు



బదిలీల కోసం టీచర్ల కసరత్తు

- వాట్సాప్ గ్రూపుల్లో చర్చలు
- టీచర్ల మధ్య చేతులు మారుతున్న లక్షల రూపాయలు
- బాండ్ పేపర్లపై ఒప్పందాలు
- ఆర్థికంగా లేని ఉపాధ్యాయులకు నష్టం

జనగామ: ఉపాధ్యాయుల పరస్పర బదిలీలు కొంత మంది టీచర్లకు కాసులు కురిపిస్తున్నాయి. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు బేరసారాలకు దిగుతూ కోరుకున్న చోటుకు వెళ్లేందుకు తహతహలాడుతున్నారు. మధ్యవర్తులను రంగంలోకి దింపి.. ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. దీంతో ఆర్థికంగా లేని ఉపాధ్యాయులు నిరాశ చెందాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం సీనియార్టీ, విభజనతో సంబంధం లేకుండా 317 జీఓ ద్వారా టీచర్లను ఇతర జిల్లాలకు బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వస్తే.. 317 జీఓ ద్వారా స్థానికతను కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇవ్వగా... ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ప్రాసెస్ మొదలు పెట్టింది. దీంతో టీచర్లు తమకు అనుకూలస్థానాల కోసం కసరత్తు చేస్తున్నారు.

జనగామ నుంచి 317 జీఓ ద్వారా 790మంది ఉపాధ్యాయులు ఇతర జిల్లాలకు వెళ్లగా.. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 500 మంది ఇక్కడకు వచ్చారు. ఇందులో 117 పరస్పర బదిలీలు కాగా.. 80 స్పౌజ్, 20 మెడికల్ బదిలీలు ఉన్నాయి. 317 జీఓలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు ప్రస్తుత ప్రభుత్వం స్పౌజ్ (భార్య, భర్తలు ఒకేచోట పనిచేసే అవకాశం), పరస్పరం, మెడికల్ (గుండె, కేన్సర్, న్యూరో, తల్లిదండ్రులకు చికిత్స నిమిత్తం, తదితర ఆరోగ్య కారణాలు) మూడు కేటగిరీల వారి బదిలీలకు అవకాశం ఇచ్చింది. ఈ జీఓ ద్వారా స్థానికతను కోల్పోయిన వారికి సంబంధించి నిబంధనలను అనుసరించి ప్రభుత్వమే బదిలీలు చేయాల్సి ఉండగా.. పరస్పర బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానించడం.. ఒప్పందాలు, బేరసారాలకు దారి తీస్తోంది. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ, పలువురు ఉపాధ్యాయుల మధ్య జరుగుతున్న డబ్బుల మార్పిడితో చెడ్డపేరు తీసుకొచ్చే విధంగా మారిపోతుంది.

వాట్సాప్ గ్రూపుల్లో చర్చలు

మ్యూచువల్ బదిలీల కోసం వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేశారు. హెచ్‌ఆర్‌ఏ ప్లేస్ నుంచి పరస్పర బదిలీలకు సిద్ధంగా ఉన్నారు. అవసరమైన టీచర్లు సంప్రదించండి.. అంటూ గ్రూపులో బాహాటంగానే పోస్టులు చేస్తున్నారు. సదరు నంబర్‌కు ఫోన్ చేసి అడిగితే.. మా ఫ్రెండ్ ఉన్నారు.. ఫంక్షన్‌లో సంప్రదింపులు వద్దు.. ప్రత్యక్షంగా కలుసుకుని మాట్లాడుకుందామంటూ చెబుతున్నారు. ధర ఎంత అని గుచ్చి గుచ్చి అడిగితే రూ.15లక్షలు ఉండవచ్చు.. ఇద్దరం కూర్చొని మాట్లాడితే ఓ లక్ష తగ్గొచ్చు.. అంటూ ఆఫర్ ఇస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం బాధిత నిరుపేద టీచర్ల జీవితాలపై నీలి నీడలు కమ్ముకునేలా చేస్తున్నాయి.

డబ్బులు ఉన్నవారికే బదిలీలు



గత ప్రభుత్వం ఉద్యోగుల విభజన కోసం తీసుకొచ్చిన జీఓ 317 పెద్ద దుమారాన్ని లేపింది. స్థానికత సీనియారిటీ ప్రాతిపదికన విభజనతో సంబంధం లేకుండా చాలా మంది టీచర్లు తప్పనిసరి పరిస్థితుల్లో వేరే జిల్లాలకు నెట్టబడ్డారు. గడచిన ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని సవరించేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టడం స్వాగతించదగిన విషయం. కానీ, బేరసారాల వల్ల డబ్బు ఉన్న వారు మాత్రమే సొంత జిల్లాలకు వెళ్లే అవకాశం ఉంటుంది. బదిలీల్లో బేరసారాలను కట్టడి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

- పి.చంద్రశేఖర్ రావు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలి



317జీఓ బాధితులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో స్పష్టంగా పేర్కొంది. కానీ, కేవలం పరస్పర బదిలీలు, ప్రత్యేక కేటగిరీల వారికే అవకాశం ఇచ్చింది. జీఓ నిబంధనల మేరకు స్థానికేతర జిల్లాలకు వెళ్లినవారికి న్యాయం జరగడం లేదు. పరస్పర బదిలీల్లో డబ్బులు చేతులు మారుతున్నాయని వార్తలు ఉన్నాయి. 317 జీఓతో మొదటి ప్రాధాన్యత ద్వారా తమ ఇష్టం మేరకు జిల్లాలో పోస్టింగ్ పొందిన వారికి మళ్లీ పరస్పర బదిలీ అవకాశం ఇవ్వడం సరికాదు. అవకాశం, అర్హత కలిగిన ఉపాధ్యాయులందరికీ న్యాయం జరగాలి.

- డి.శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రభుత్వం పునరాలోచన చేయాలి



జీఓ 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను తిరిగి సొంత జిల్లాకు బదిలీ చేసి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాల్సింది పోయి, కేవలం స్పౌజ్, మ్యూచువల్, మెడికల్ గ్రౌండ్ ఆధారంగా బదిలీలకు తెరలేపింది. గత ప్రభుత్వం సీనియర్, జూనియర్ పేరిట అసలు స్థానికతను కరుమరుగు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం స్థానికతను శాశ్వతంగా సమాధి చేయబోతుంది. పునరాలోచించి 317 బాధితులకు న్యాయం చేయాలి.

- బుర్ర రమేశ్, టీయూటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి

లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్

- వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు, అధికారులు



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, అధికారులు

జనగామ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్ రూపొందించామని, ఈ ఏడాదిలో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణాలు చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బ్ధిదారుల ఎంపికకు రూపొందించిన ప్రత్యేక యాప్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి సీఎం గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జనగామ కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేశ్ కుమార్ వీసీ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రజాపాలనలో అందిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారులను గుర్తించేందుకు మొబైల్ యాప్ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రజాపాలనలో ఎటువంటి పైరవీలకు, రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా అర్హులకు మాత్రమే ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్లను ఈ పథకం ద్వారా కేటాయిస్తామన్నారు. నాలుగు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో రూ.5 లక్షలు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జిల్లా గృహ నిర్మాణ శాఖ నోడల్ అధికారి దామోదర్ రావు, సహాయక ఇంజనీర్లు రాంచంద్రమూర్తి, నరేందర్ రాజు, ఏఎం రాజ్యలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జనగామ మార్కెట్‌కు మరింత వైభవం

- ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్



మార్కెట్‌లో పరిశీలిస్తున్న చైర్మన్, అధికారులు

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌కు మరింత వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. మార్కెట్‌లో పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్లేష్, ఏఎంసీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి శివరాజ్ గురువారం మార్కెట్‌లో పర్యటించారు. గతంలో తీర్మానం చేసిన రెండు కవర్ షెడ్లు, డ్రెయినేజీ పనులు, సీసీ రోడ్లు, రైతులకు విశ్రాంతి భవనం, మార్కెట్‌లో కనీస మౌలిక వసతులకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థలాలను పరిశీలించి కొలతలు తీసుకున్నారు. ఈసందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో సరుకులను అమ్ముకునేందుకు తీసుకొచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాకాలంలో సరుకులు తడిసిపోకుండా మరో రెండు కవర్ షెడ్ల నిర్మాణం చేపట్టనుండగా, గుంతలమయంగా మారిన కళ్లం రూపు రేఖలు మారుస్తామన్నారు. నర్సింహులు, శ్రీలతరెడ్డి, నర్సింగరావు, రవీందర్, సూపర్ వైజర్లు శ్రీనివాస్, నాగార్జున, రైతులు తుపాకుల రాములు, ముక్కెర యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- డీఈఓ రమేశ్



కొడకండ్లలో భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ, జీసీడీఓ

కొడకండ్ల/స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డీఈఓ రమేశ్, జీసీడీఓ గౌసియాబేగం ఆదేశించారు. కొడకండ్ల మండల కేంద్రం, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని నమిలిగొండ కస్తూర్బా బాలికల పాఠశాలలను గురువారం తనిఖీ చేసి వంట గది, పరిసరాలు, కూరగాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణ కార్యక్రమంలో తెలిపిన నిబంధనలను పాటించాలన్నారు. స్టడీ అవర్‌ను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓలు మమత, రజిత సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- డీసీపీ రాజమహేంద్రనాయక్



జనగామ చౌరస్తాలో ట్రాఫిక్, పార్కింగ్‌పై పర్యవేక్షణ చేస్తున్న డీసీపీ, పక్కన ఏసీపీ, సీఐ

జనగామ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. ఏసీపీ పార్థసారథి, సీఐ దామోదర్‌రెడ్డితో కలిసి ఆర్టీసీ చౌరస్తా, తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. అంతకుముందు కొత్తగా విధుల్లో చేరిన ట్రాఫిక్, పోలీసులతో ట్రాఫిక్ నియంత్రణ, తదితర విషయాలపై మాట్లాడారు. వ్యాపార, వాణిజ్య సంస్థల ఎదుట అడ్డదిడ్డంగా పార్కు చేసిన వాహనాలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా యాజమాన్యాలు పోలీసులకు సహకరించాలన్నారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లను ఆక్రమించకుండా, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దుకాణాలకు వచ్చే వాహనాలను ఒకే వరుసలో పార్కింగ్ చేసే బాధ్యత యాజమాన్యంపై ఉంటుందన్నారు. ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసి, ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి దుకాణం ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని, భద్రతను మరింత పెంచుకోవాలని వ్యాపారులకు సూచించారు. కొత్తగా విధుల్లో చేరిన ట్రాఫిక్ కానిస్టేబుళ్లు.. ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డీసీపీ వెంట ఎస్సైలు రాజేశ్, చెన్నకేశవులు, శ్వేత తదితరులు ఉన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, డీసీపీ రాజమహేంద్ర నాయక్



క్రికెట్‌లో గెలుపొందిన రెవెన్యూ టీం

జనగామ రూరల్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని, క్రీడల్లో గెలుపోటములు సహజమని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో గురువారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మీడియా, రెవెన్యూ టీంల మధ్య నిర్వహించే క్రికెట్ పోటీని టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... నిత్యం ఉద్యోగ బాధ్యతల్లో నిమగ్నమై ఉన్న వారికి ఈ క్రీడా పోటీలు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. క్రికెట్‌లో రెవెన్యూ శాఖ టీం గెలుపొందగా, పోలీసు శాఖ టీం రన్నరప్‌గా నిలిచింది. క్యారమ్స్‌లో పి.అరుణ గెలుపొందగా రన్నరప్‌గా పి.శృతి నిలిచారు. మ్యూజికల్ చైర్ గేమ్‌లో ఎం.రజిత గెలుపొందగా.. పి.అరుణ రన్నరప్ నిలిచారు. లెమన్ అండ్ స్పూన్‌లో సీహెచ్.ఆరోగ్య మేరీ గెలుపొందగా, పి.శృతి రన్నర్ అప్ గా నిలిచారు. బ్యాడ్మింటన్‌లో డి.విక్రమ్ నెగ్గగా, రన్నరప్‌గా రామారావు నాయక్ నిలిచారు.

బ్యాటింగ్‌లో అదరగొట్టిన కలెక్టర్

క్రీడాపోటీల నేపథ్యంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్ బౌలింగ్ చేయగా.. కలెక్టర్ రిజ్వాన్ బాషా బ్యాటింగ్‌తో అదరగొట్టారు. అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ కూడా బ్యాటింగ్ చేశారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా బౌలింగ్ చేయగా.. డీసీపీ రాజ మహేంద్ర నాయక్ బ్యాటింగ్‌తో క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో ఏసీపీ పార్థసారథి, వెంకట్ రెడ్డి, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, రెవెన్యూ ఉద్యోగులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎంపికైన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మకంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపడుతుంటే ప్రతిపక్షాలు పనికట్టుకుని చేస్తున్న పసలేని విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టేలా పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా పనిచేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించిన జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు ఎమ్మెల్యే శ్రీహరి పుష్పగుచ్ఛాలు అందించి స్వీట్లు తినిపించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువజన కాంగ్రెస్ నాయకులు కలిసికట్టుగా పార్టీ కోసం పనిచేయాలన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ తదితర ప్రతిపక్షాలు సోషల్‌మీడియా వేదికగా చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ కాంగ్రెస్ పార్టీ సత్తాను చాటాలన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 8న మడికొండలోని సత్యసాయి ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలో స్టేషన్‌ఘన్‌పూర్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డిచే శంకుస్థాపన చేసుకోబోతున్నామని, భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, నాయకులు నరేందర్‌రెడ్డి, వెంకన్న, ఐలయ్య, బ్రహ్మారెడ్డి, శ్రీధర్‌రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు క్రాంతి, ఇల్లందుల విజయ్, శివచరణ్‌రెడ్డి, రజాక్‌యాదవ్, ప్రభాకర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌ను వినియోగించుకోవాలి

- ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సదానందంగౌడ్



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సదానందంగౌడ్

రఘునాథపల్లి: చదువు మధ్యలో మానేసిన వారు ఓపెన్ స్కూల్ విద్యను వినియోగించుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ అనగోని సదానందంగౌడ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రవేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రత్యేక ప్రవేశాలకు ఈ నెల 11 వరకు గడువు పొడగించిందని తెలిపారు. రెగ్యులర్ కోర్సులకు సమానంగా ఈ ధ్రువపత్రాలు ప్రభుత్వ ఉద్యోగాలకు సమాన అవకాశం ఉంటుందన్నారు. గతంలో ఓపెన్ స్కూల్ ద్వారా చదివినవారు ఎంతో మంది ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రవేశ ఫీజును మీసేవ ఆన్‌లైన్ కేంద్రాల్లో మాత్రమే చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9346020003 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కీర్తి రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను వినియోగించుకోవాలి



మైత్రీ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ రూరల్: మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను ట్రాన్స్‌జెండర్స్ వినియోగించుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను కలెక్టర్ గురువారం ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలోని ట్రాన్స్ జెండర్లు మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను వినియోగించుకొని వైద్య చికిత్సలు పొందాలని తెలిపారు. ప్రతి గురువారం ఈ క్లినిక్ నడుస్తుందని తెలిపారు. అదే విధంగా ఐడీ కార్డులు లేని ట్రాన్స్ జెండర్లు దరఖాస్తు చేసుకొని, పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్, సీడీపీఓ రమాదేవి, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ చింతకింది రాజు, సదానందం, మైత్రి ట్రాన్స్ క్లినిక్ స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ రమేష్ రెడ్డి, డాక్టర్ అచ్యుత, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణం మహిళలకు ఉపయోగకరం

జనగామ రూరల్: ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం మహిళా ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరం అని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ డిపోలో వేడకలు నిర్వహించగా.. డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి కలెక్టర్ పాల్గొని, డిపో ఆవరణలో పూల మొక్కను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణ సదుపాయంతో మహిళలకు ప్రయాణ ఖర్చు ఆదా అవుతుందన్నారు. ఆ డబ్బులు ఇతర అవసరాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది సేవలను ప్రశంసించారు. ఈ పథకం వల్ల మహిళా ప్రయాణికుల సంఖ్య 65 శాతానికి పెరిగిందని, తద్వారా ఆర్టీసీకి అధిక ఆదాయం చేకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ స్వాతి, ఏసీపీ పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

కేయూ పరీక్షల నియంత్రణాధికారిగా రాజేందర్



నియామకపత్రం అందుకుంటున్న రాజేందర్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌ను నియమిస్తూ గురువారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాజేందర్ ప్రస్తుతం ఆయన కేయూ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్‌గా, కామర్స్ విభాగం బీఓఎస్‌గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి నియమాక ఉత్తర్వులు రాజేందర్‌కు అందజేశారు. ఆయన ఒక సంవత్సరం పాటు ఈబాధ్యతలు నిర్వర్తించనున్నారు.

ఆటల్లో ఆణిముత్యాలు

మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ


ఆశ్రమ పాఠశాలలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు


క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్, వార్డెన్ వీరమ్మ

- రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సొంతం

నల్లబెల్లి: క్రీడల సాధనకు అనువైన ప్రాంగణం.. ఆటలపై ఆసక్తి ఉన్న బాలికలకు మెళకువలు నేర్పించేందుకు అనుభవం కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు. వారి ప్రోత్సాహంతో ప్రణాళికాబద్ధంగా చదువుతోపాటు క్రీడల్లో సత్తా చాటుతూ ముందుకు సాగుతున్నారు. దీంతో క్రీడాపోటీలు ఎక్కడ జరిగినా ప్రతిభకనబరిచి పతకాలు సాధిస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలో అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. మరింత సహకారం అందిస్తే అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నామంటున్నారు మండలంలోని మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన పలువురు క్రీడాకారులు..

క్రీడలు, చదువుకు సమ ప్రాధాన్యం..

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుకు, క్రీడలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో కబడ్డీ, వాలీబాల్, ఖోఖోతోపాటు అథ్లెటిక్స్‌లోనూ విద్యార్థినులు రాణిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థినులు సాధన చేస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరుస్తున్నారు. భవిష్యత్‌లో మరింత రాణిస్తామని విద్యార్థినులు చెబుతున్నారు.

కబడ్డీలో పట్టు సాధించిన నాగేశ్వరి



పర్వతగిరి మండలంలోని పంచరాయితండాకు చెందిన రైతు బానోత్ వెంకన్న–భారతి దంపతుల కుమార్తె నాగేశ్వరి. తల్లిదండ్రులు మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల పాఠశాలలో ఆమెను ఐదో తరగతిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె పదో తరగతి చదువుతోంది. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో కబడ్డీలో నిత్యం సాధన చేస్తోంది. మెళకువలు నేర్చుకుని నాగేశ్వరి పట్టు సాధించింది. గత నెల 5, 6, 7 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–17 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. అంతేకాకుండా గతంలో ఏటూరునాగారంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం, భద్రాచలంలోని కిన్నెరసానిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చింది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ..



నర్సంపేట మండలంలోని పర్శనాయక్ తండాకు చెందిన కొర్ర శ్రీను కుమార్తె శ్రుతి ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. విజయం సాధించాలనే లక్ష్యంతో బరిలో దిగుతుంది. మెదక్‌లో జరిగిన అండర్–14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయస్థాయిలో విజయం సాధించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో ఉదయం, సాయంత్రం శిక్షణ తీసుకుంటోంది.

అంతర్జాతీయ పోటీలకు శిక్షణ..



బానోత్ రాజేశ్వరి మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తోంది. ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో వాలీబాల్ పోటీల్లో రాణించేందుకు నిరంతరం సాధన చేస్తోంది. ఇప్పటి వరకు రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యేలా పాఠశాలలో శిక్షణ పొందుతోంది. చదువును ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఆటల్లో రాణిస్తోంది.

విద్యార్థినులను ప్రోత్సహిస్తున్నాం..



విద్యార్థినులకు క్రీడల్లో ఆసక్తి పెంచేలా ప్రోత్సహిస్తున్నాం. వారిలోని ప్రతిభ ఆధారంగా క్రీడల్లో మెళకువలు నేర్పిస్తున్నాం. మెరుగైన శిక్షణను అందించి జాతీయస్థాయిలో పతకాలు సాధించేలా తీర్చిదిద్దాలన్నదే నా ఆశయం. ఇప్పటికే విద్యార్థినులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు.

– బానోత్ దేవీలాల్, పీడీ

క్లుప్తంగా

తల్లిని గెంటేసిన కూతురు

న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తల్లి రామక్క



నెల్లికుదురు: కడదాక కాపాడు తానని చెప్పి తల్లి వద్ద ఉన్న డబ్బు మొత్తం తీసుకున్న ఓ కూతురు.. మాట తప్పి తల్లిని ఇంటి నుంచి గెంటివేసింది. ఈ ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం చిన్న ముప్పారంలో చోటు చేసుకుంది. బాధితురాలు, తల్లి పాదిల రామక్క కథనం ప్రకారం.. రామక్కకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉంది. వృద్ధాప్యంలో ఉన్న రామక్క తన వద్ద డబ్బులన్నీ కొడుకుల సమక్షంలో తన కూతురు ముదిరికోల్ల ధనమ్మకు అప్పగించి తాను కూతురు వద్దనే ఉంటానని తెలిపింది. ఇన్ని రోజులు కాలం గడిచిందని, ఇప్పుడు నీకు, నాకు ఎలాంటి సంబంధం లేదని ఇంటి నుంచి వెళ్లిపోవాలని తల్లి రామక్కను కూతురు ఇంటి నుంచి వెళ్లగొట్టింది. దీంతో బాధితురాల తనకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

మావోయిస్టు జైసింగ్ మృతదేహం అప్పగింత

ఏటూరునాగారం: చెల్పాక అడవుల్లో ఈనెల 1న జరిగిన పోలీసు ఎదురుకాల్పుల్లో మృతి చెందిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగులూరు పోలీస్‌స్టేషన్ పరిధి కుసునూరుకు చెందిన మావోయిస్టు కమిటీ సభ్యుడు జైసింగ్ మృతదేహాన్ని గురువారం తల్లి పొట్టెం సన్ని, సోదరుడు పొట్టెం లక్ష్మణ్‌కు అప్పగించారు. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత మృతుడి వివరాలను కుటుంబ సభ్యులకు తెలిపినప్పటికీ ఆలస్యంగా రావడంతో మంగపేట ఎస్సై సూరి, మరో ఎస్సై సురేష్ ఆధ్వర్యాన అప్పగించారు.

నేడు మధు మృతదేహం తరలింపు

ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఏగొలపు మల్లయ్య అలియాస్ మధు మృతదేహాన్ని శుక్రవారం తీసుకువెళ్లనున్నట్లు అతడి భార్య మీనా తెలిపారు. హైకోర్టు పిటిషనర్ న్యాయవాది, ప్రభుత్వాధికారి, తహసీల్దార్, బంధువుల సమక్షంలో మృతదేహాన్ని పరిశీలించి భార్యకు అప్పగించనున్నారు. మధు దహన సంస్కారాల అనంతరం కోర్టులో విచారణ చేయనున్నట్లు సమాచారం.


గృహప్రవేశం చేసిన మరునాడే మృత్యుఒడికి..

- విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి
- నర్సింహులగూడెంలో ఘటన


నర్సయ్య (ఫైల్)

నెల్లికుదురు: గృహ ప్రవేశం చేసిన మరునాడే ఓ వ్యక్తి మృత్యుఒడికి చేరాడు. విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెదగోని నర్సయ్య (45) ఈ నెల 4న గృహ ప్రవేశం చేశాడు. అద్దె ఇంట్లో ఉన్న సామాన్లు నూతన గృహంలోకి తరలిస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ గురై కిందపడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి నర్సయ్య మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు.


పుల్లూరులో రైతు..


లాలు (ఫైల్)

గార్ల: వ్యవసాయ బావి వద్ద మోటార్‌కు మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై బావిలో పడి ఓ గిరిజన రైతు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం గార్ల మండలం పుల్లూరు సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై జీనత్‌కుమార్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బోటితండాకు చెందిన కొర్ర లాలు(55)కు మానుకోట జిల్లా గార్ల మండలం పుల్లూరు పంచాయతీలో వ్యవసాయ భూమి ఉంది. మిరప తోటకు నీళ్లు కట్టేందుకు మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లగా మరమ్మతుకు గురైంది. దీంతో మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై పక్కన ఉన్న వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య అచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అభివృద్ధి దిశగా ఉర్సు గుట్ట

- ఫోర్ షోర్ డెవలప్ మెంట్ ఆఫ్ ఉర్సుగుట్ట లేక్‌లో కదలిక
- మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో ముందుకెళ్లనున్న ప్రాజెక్టు
- రూ.14.50 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభమైతే మరో టూరిస్ట్ స్పాట్



సాక్షి, వరంగల్: పర్యాటక ప్రాంతంగా ఉర్సుగుట్ట అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. స్మార్ట్ సిటీలో భాగంగా ఐదేళ్ల క్రితం ఈ చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించారు. టెండర్ వరకు వచ్చి ఆగడంతో మళ్లీ దీనిని పట్టించుకునేవారు లేక పోవడంతో అటకెక్కింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఆధ్వర్యంలో రూ.14.50 కోట్ల అంచనాతో రూపొందించిన 'ఫోర్ షోర్డ్ డెవలప్ మెంట్ ఆఫ్ ఉర్సుగుట్ట లేక్' పనులపై వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ దృష్టి సారించారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు ముందుకెళ్లే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు అధికారులు కూడా పూర్తిస్థాయిలో నివేదికను సిద్ధం చేసినట్లు తెలిసింది.

సకల సౌకర్యాలతో అభివృద్ధి ఇలా..

ఉర్సుగుట్ట చెరువు దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దీనికి రెండువైపులా బండ్ సుందరంగా తీర్చిదిద్దే అవకాశముంది. ఇంకోవైపు స్టేట్ హైవే ఉండడం, మరో వైపు ఓపెన్ బండ్ ఉండడం వల్ల పనులకు కాస్త ఇబ్బందిగా పరిణమించనుంది. అయితే అవకాశమున్న చోట మాత్రమే బండ్‌ను సకల సౌకర్యాలతో తీర్చిదిద్దేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. చెరువుకు 750 మీటర్ల పొడవున్న ఆరుమీటర్ల వెడల్పుతో సైక్లింగ్ ట్రాక్, 1700 మీటర్ల పొడవున్న వైపు మూడు మీటర్ల వెడల్పుతో వాకింగ్ ట్రాక్‌తోపాటు పర్యాటకులు కూర్చునేలా సరికొత్త హంగులతో సిట్టింగ్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే, ఉర్సుగుట్ట పక్కనే ఓపెన్ జిమ్ ఏర్పాటుచేయడం కూడా నగరవాసుల ఆరోగ్యానికి ఉపయోగపడనుంది. అక్కడే ఉన్న మైదానంలో పిల్లలు క్రికెట్, పెద్దలు వాలీబాల్ ఆడుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. నడిచేందుకు టైల్స్, రాత్రివేళ కళ్లు మిరుమిట్లు గొలిపేలా లైట్లు అమర్చనున్నారు. అలాగే బతుకమ్మ, వినాయక నిమజ్జన పాయింట్లు ఉన్న ప్రాంతంలో కెఫెటేరియా నిర్మించనున్నారు. దిమ్మెలపై టెంట్ ఆకారంతో ఏర్పాటుచేసే కుర్చీల్లో కూర్చొని సరస్సులోని అలలను చూస్తూ.. ఇష్టమైన ఆహారం తీసుకుంటూ కుటుంబంతో సరదాగా గడిపేలా ప్రణాళికలు రూపొందించారు. అలాగే, మూడు నుంచి పదేళ్లలోపు పిల్లలకు సైన్స్ పార్కు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ప్రాజెక్టు పనులు మొదలైతే ఏడాదిన్నరలోపు పూర్తయ్యే అవకాశముంటుందని బల్దియా ఇంజనీరింగ్ విభాగాధికారి ఒకరు తెలిపారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం


బాలు(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : అప్పుల బాధతో ఓ రైతు గడ్డి మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేవుల తండా గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ బాలు (55)కు 1.30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతేడాది ఎకరం మిర్చి సాగు చేయగా అప్పులు కావడంతో పాటు దిగుబడిరాక ఆర్థికంగా నష్టపోయాడు. బ్యాంకులో రూ.2 లక్షలు, ఇతరుల వద్ద రూ.లక్ష.. మొత్తం 3 లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ ఏడాది మొక్కజొన్న సాగుచేశాడు. దిగుబడి వస్తుందో.. రాదోనని మనోవేదనకు గురయ్యాడు. దీంతో బుధవారం సాయంత్రం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి తెలిపారు.

పట్టపగలు.. రెండు ఇళ్లలో చోరీ


ఘటనా స్థలిలో వివరాలు సేకరిస్తున్న ఫింగర్ ప్రింట్ బృందం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో దొంగలు పట్టపగలే రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. అనంతరం మరో ఇంట్లో కూడా చోరీకి యత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మానుకోట జిల్లా కేంద్రంలోని మల్లం బజార్‌కు చెందిన మహేందర్, స్రవంతి దంపతులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో దొంగలు ఇంటి తలుపు తాళం తొలగించి ఆరు బంగారు లక్ష్మీదేవి కాయిన్లు, రూ. ఆరు వేల నగదు అపహరించుకెళ్లారు. అనంతరం బెస్త బజార్‌కు చెందిన జంగిలి హరీశ్ ఇంట్లో ఏడు తులాల వెండి, ముప్పావు తులం బంగారు ఆభరణాలు, రూ. ఆరు వేల నగదు అపహరించారు. అక్కడి నుంచి పక్కన ఉన్న దుగ్గి పూలమ్మ ఇంట్లో కూడా చోరీకి యత్నించారు. ఇక్కడ నగదు లభించలేదు. ఈ ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.విజయ్ కుమార్, ఫింగర్ ప్రింట్ బృందంతో కలిసి ఘటన స్థలాలకు చేరుకుని ఆధారాలు సేకరిస్తున్నారు.

రేపటి నుంచి వార్షిక సమావేశం

కేయూ క్యాంపస్: ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 49వ వార్షిక కాంగ్రెస్, 43వ ప్లేస్‌నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక కాంగ్రెస్ సమావేశాన్ని ఈనెల 7 నుంచి 9 వరకు నిర్వహించనున్నారు. కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ విభాగం అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సోషల్ సైన్స్ డీన్, లోకల్ సెక్రటరీ ప్రొఫెసర్ టి.మనోహర్, ఆ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్.రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసనాల ద్వారా వాస్తవిక చరిత్రను వెలికి తీయడంపై ఈకాన్ఫరెన్స్‌లో చర్చ ఉంటుందని తెలిపారు. ఈప్రారంభ సమావేశాన్ని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. మైసూర్ ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్‌ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ స్వామినాథన్, యూనివర్సిటీ ఆఫ్ కలకత్తా యన్షియంట్ ఇండియన్ హిస్టరీ అండ్ కల్చర్ విభాగాధిపతి, ప్లేస్ నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ ప్రెసిడెంట్ ఆచార్య సుస్మిత బసు మజుందార్, యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేశ్‌లాల్ పాల్గొననున్నట్లు వారు తెలిపారు.

సేంద్రియ పంటలతోనే నేల సారవంతం


మృత్తిక దినోత్సవంలో రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులు

వరంగల్ : సేంద్రియ పంటలతోనే నేల సారవంతమవుతుందని వరంగల్ నాబార్డ్ సీజీఎం ఎల్.చంద్రశేఖర్ అన్నారు. గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా ఆరెపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నాబార్డు వరంగల్ ఆర్థిక సాయంతో రైతులు, విద్యార్థులు, శాస్త్రవేత్తలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని సంరక్షించడానికి కావాల్సిన సేంద్రియ పంటలు పండించాలన్నారు. రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట, ఎరువులు, విత్తనాలను పండించడానికి కావాల్సిన ఆర్థిక సాయాన్ని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు నాబార్డు అందిస్తుందన్నారు. మృత్తిక శాస్త్రవేత్త, పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి మాట్లాడుతూ భూమిపై మానవ జీవితం ఆరోగ్యకర నేలలపై ఆధారపడి ఉంటుందన్నారు. నేల ఆరోగ్య పరిరక్షణలో అనేక మార్గాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ కాలేజ్ వరంగల్ డీన్ వెంకట్‌రెడ్డి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ దిలీప్, శిక్షణ నిర్వాహకుడు డాక్టర్ సీహెచ్.రాములు, తదితరులు పాల్గొన్నారు.

సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు ప్రశాంతం

- నేడు ముగియనున్న రైల్వే ఎలక్షన్లు


కాజీపేట రైల్వే ఎన్నికల శిబిరం వద్ద నాయకులు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో బుధవారం ప్రారంభమైన 'రైల్వే వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్' సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. వివిధ రైల్వే డిపోలు, కార్యాలయాలు, షెడ్లలో పని చేస్తున్న రైల్వే విభాగాల కార్మికులు తరలివచ్చి ఓటు వేశారని రైల్వే జనరల్ బ్రాంచ్ చైర్మన్ డి.శ్రీనివాస్‌యాదవ్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ముగింపు రోజు రన్నింగ్ స్టాఫ్ లోకోపైలెట్లకు ఎన్నికలు ఉంటాయన్నారు. జమ్మికుంట రైల్వే మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ చైర్మన్ వి.రాజయ్య, సెక్రటరీ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓటర్లు అయిన కార్మికులకు కాజీపేటలో ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్ వివరాలు తెలిపి పోల్ చీటీలు పంపిణీ చేశారు.

పోలింగ్ శాతం

ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగినట్లు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ చింత మురళి తెలిపారు. ఇందులో డీజిల్‌షెడ్ పోలింగ్ కేంద్రం–13లో 287, ఎలక్ట్రిక్‌షెడ్ పోలింగ్ కేంద్రం–14లో 174, రైల్వే ట్రెనింగ్ స్కూల్ సెంటర్ పోలింగ్ కేంద్రం–37లో 280, డివిజనల్ ట్రెనింగ్ సెంటర్ పోలింగ్ కేంద్రం–11లో 188, డివిజనల్ ట్రెనింగ్ సెంటర్ పోలింగ్ కేంద్రం–12లో 309 ఓట్లు పోలయ్యాయని చెప్పారు.

భార్య మరణించిన మూడు రోజులకే..

- తనువు చాలించిన భర్త



సంజీవరావు, భాగ్యమ్మ(ఫైల్)

దుగ్గొండి/ఖిలావరంగల్: జీవితం చివరి అంకానికి చేరింది.. వృద్ధాప్యం మీద పడింది.. నిత్యం సేవలందిస్తూ సపర్యలు చేసే భార్య మృతి చెందింది.. కడుపున పుట్టినవారు ఖండాంతరాల్లో ఉన్నారు. ఇక తాను ఉండలేనంటూ గ్రామస్తులతో చెప్పిన భర్త రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బంధంపల్లిలో చోటుచేసుకుంది. బంధంపల్లికి చెందిన పల్లం సంజీవరావు(72) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ 2010లో రిటైర్డ్ అయ్యాడు. అప్పటికే మొదటి భార్యకు ఇద్దరు కుమారులు ఉన్నా ఆమె విడాకులు తీసుకుని వెళ్లి పోయింది. రెండో పెళ్లి చేసుకుని జీవనం సాగిస్తున్న క్రమంలో ఆమె మృతి చెందింది. మళ్లీ మూడేళ్ల క్రితం వంగరి భాగ్యమ్మ మూడో పెళ్లి చేసుకున్నాడు. ఆమె మూడు రోజుల క్రితం ఇంట్లోనే మృతి చెందింది. అంత్యక్రియల అనంతరం బంధువులంతా బుధవారం వెళ్లిపోయారు. సంజీవరావు మాత్రమే మిగిలారు. ఇక తనకు ఎవరూ తోడులేరని గురువారం తెల్లవారుజామున బయటకు వెళ్లి వరంగల్ సమీపంలోని ధర్మారం వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

30 ఏళ్లకు వచ్చి తలకొరివి పెట్టి..

సంజీవరావు మొదటి భార్యకు ఇద్దరు కుమారులున్నారు. ఆమె విడాకులిచ్చిన తర్వాత వారితో సంబంధం తెగింది. తర్వాత రెండు వివాహాలు చేసుకోగా వారికి సంతానం లేదు. మొదటి భార్య పెద్ద కుమారుడు ప్రవీణ్ ములుగు జిల్లా కేంద్రంలో, రెండో కుమారుడు అరుణ్ అమెరికాలో స్థిరపడ్డారు. సంజీవరావు మృతి సమాచారాన్ని ప్రవీణ్‌కు అందించి సర్దిచెప్పగా తలకొరివి పెట్టడానికి ఒప్పుకున్నాడు.

సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు

- నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్
- 'సుమతిరెడ్డి'లో అభిజ్ఞాన్ 3.0 వేడుకలు షురూ


ఆనంద్ కిశోర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి

హసన్‌పర్తి: సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని నిట్ ప్రొఫెసర్ ఆనంద్ కిశోర్ అన్నారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారు ఎస్సార్ యూనివర్సిటీ ప్రాంగణంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న అభిజ్ఞాన్ 3.0 వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమానికి ఆనంద్ కిశోర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తులు వెలికితీయొచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా బెంగళూరుకు చెందిన సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్ రూపక్ వోలేటి ఎథికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీ అంశాలపై ప్రయోగాత్మకంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఈఈఈ అడ్వైజర్ మూల రాము, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రీవాణి, ఏటి వేణుగోపాలస్వామి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర అందించడంలో సీసీఐ విఫలం

- రైతు కమిషన్ వెల్ఫేర్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి


పత్తి యార్డులో ధర గురించి రైతులను అడిగి తెలుసుకుంటున్న కోదండరెడ్డి

వరంగల్: పత్తి రైతులకు మద్దతు ధర అందించడంలో సీసీఐ విఫలమైందని, ఈవిషయాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని రైతు కమిషన్ వెల్ఫేర్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. గురువారం ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌ను కమిషన్ వెల్ఫేర్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సభ్యులు కెవిఎన్.రెడ్డి, సునీల్, భవానీరెడ్డి, గోపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈసందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీసీఐ మార్కెట్‌కి వచ్చిన పత్తిని కొనుగోలు చేయాలన్నారు. కాగా, గోనె సంచుల్లో ఉన్న పత్తిని కూడా కొనుగోలు చేసేలా కేంద్ర ప్రభుత్వం, సీసీఐపై ఒత్తిడి చేస్తామని రైతులకు కోదండరెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో కార్యదర్శి పి.నిర్మల అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీఐ లాభాల్లో ఉందని, రైతులను నష్టాల్లో పడేయడం సరికాదన్నారు. ఎంఎస్‌పీ ప్రకారం ప్రతి రైతు దగ్గర పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనం..

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయాన్ని గురువారం రైతు వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు.. కోదండరెడ్డికి తీర్థప్రసాదాలు, మహదాశీర్వచనం అందజేశారు.

మట్టెవాడ పోలీసుల అదుపులో హత్య నిందితుడు?

రామన్నపేట : వరంగల్ నగరంలోని రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగిని హత్య చేసిన నిందితుడిని మట్టెవాడ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హత్యకు గల కారణాలపై విచారణ చేపడుతున్నారు. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి రాజమోహన్ (62) తన శరీరంపై నిత్యం పెద్ద ఎత్తున బంగారం వేసుకుని తిరగడంతో బంగారంపై కన్ను వేసి హత్య చేశాడా..? ఏమైనా ఆర్థిక లావాదేవీల కోసం హత్య చేశాడా అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

రూ.20 లక్షల విలువైన ఆభరణాలు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు చూపుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో పలు ప్రాంతాల్లో దొంగ తనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. అక్టోబర్ 27న కాటారం మండలం శంకరంపల్లిలో దొంగతనం జరగ్గా బాధితుల ఫిర్యాదు మేరకు కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు ఆధ్వర్యాన మూడు టీంలు విచారణ ప్రారంభించి సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించినట్లు చెప్పారు. మంచిర్యాలకు చెందిన తాటికొండ స్వామి, ఆసిఫాబాద్ జిల్లా తిర్యానికి చెందిన కూరాసేనగా ఈశ్వర్, మహారాష్ట్ర సిరొంచకు చెందిన పనేం రాజేష్.. మహారాష్ట్రలోని చంద్రాపూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, గణపురం మండలం చెల్పూర్, కొయ్యూర్, హనుమకొండ జిల్లాలోని సుబేదారి, పెద్దపల్లి జిల్లాలోని మంథని, గుంజమడుగు, ములుగు జిల్లాలోని పస్రా ప్రాంతాల్లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల పస్రాలో దొంగిలించిన బంగారం, రెండు బైకులను విక్రయించడానికి వెళ్తుండగా బుధవారం కాటారం మండల పరిధి మద్దులపల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. నిందితుల నుంచి 17.3 తులాల బంగారం, 83 తులాల వెండి ఆభరణాలు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఒక ఎల్‌ఈడీ టీవీ, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ కిరణ్‌ఖరే వివరించారు.